అభివృద్ధి విషయంలో..
వెనకడుగు వేసేదే లేదు

ఎమ్మెల్యే వివేకానంద్


జగద్గిరిగుట్టలో ఎమ్మెల్యే వివేకానంద్‌కు నీరాజనాలు పలుకున్న బస్తీ ప్రజలు

కుత్బుల్లాపూర్: అభివృద్ధి పనుల విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని.. ఎన్ని కోట్ల నిధులైనా వెచ్చించి పూర్తి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం ప్రగతియాత్రలో భాగంగా సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని తెలుగుతల్లినగర్, శివసాయినగర్, రాజీవ్‌గృహకల్ప, కుమ్మరి బస్తీ, బాలాజీ క్వార్టర్స్, సూరారం కాలనీ 142 గజాలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని అన్నారు. అర్హులంరికీ తప్పకుండా ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొబ్బ రంగారావు, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మన్నె రాజు, రవీందర్ ముదిరాజ్, వెంకటేష్, యూసుఫ్, తారాసింగ్, పందిరి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి..

◆ గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లో రూ.40లక్షల నిర్మిస్తున్న కుత్బుల్లాపూర్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సెలూన్లకు 250 యూనిట్ల ఉచిత కరెంటుతో పాటు సబ్సిడీ రుణాలు, నైపుణ్య శిక్షణ వంటి అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సంజీవరావు, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌యాదవ్, నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు రేణయ్య నాయీ, ప్రధాన కార్యదర్శి కే.పరమేష్ నాయీ, చైర్మన్ ఎస్.రవిబాబు నాయీ తదితరులు ఉన్నారు.

రూ.2లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత..

సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాగిరెడ్డి అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించగా రూ.2 లక్షలు మంజూరయ్యాయి. సదరు చెక్కను మంగళవారం నాగిరెడ్డి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

జీఓ. 58, 59ల సందేహాలపై క్లారిటీ

కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సంజీవరావు



సుభాష్‌నగర్: ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరో మారు అవకాశం ఇచ్చింది. 2022 ఫిబ్రవరిలో జీఓ.58, 59లో కింద అవకాశం ఇవ్వగా, 2014 జూన్ 2 వరకే ప్రభుత్వ ఆక్రమిత స్థలాల్లో ఉన్నవారికే కటాఫ్ డేట్ ఇచ్చింది. తాజాగా 2020 జూన్ 2 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం మరో మారు అవకాశం ఇచ్చింది. జీఓ.58,59ల కింద ఏప్రిల్ 1 నుంచి 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. దీంతో సోమవారం కుత్బుల్లాపూర్‌లోని మీసేవ సెంటర్లకు దరఖాసుదారుల తాకిడి పెరిగింది. ఈ విషయమై కుత్బుల్లాపూర్ తాహసీల్దార్ సంజీవరావుతో సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రశ్న: జీఓ.58 59 కింద దరఖాస్తు చేసుకునేవారు, ఏ పత్రాలను పొందుపరచాలి.

జవాబు: 2020 జూన్ రెండు వరకు ప్రభుత్వ ఆక్రమిత స్థలాల్లో ఉన్నవారు నోటరీ పాటు, నీటి, కరెంటు బిల్లు లేదా ట్యాక్స్ పేపర్‌ను జత చేసి మీ సేవలో దరఖాస్తు చేయాలి.

ప్రశ్న: గత సంవత్సరం జీఓ. 58 కింద దరఖాస్తు చేసుకున్న వారు, తిరిగి దరఖాస్తు చేసుకోవాలా?

జవాబు: గత సంవత్సరం జీఓ. 58 కింద దరఖాస్తు చేసుకున్నవారు తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సినవసరం లేదు.

ప్రశ్న: ఇటీవల జీఓ.58 కింద దరఖాస్తు చేసుకున్న వారు, జీఓ.59కు మార్చుకోవాలంటే ఏమి చేయాలి.?

జవాబు: తిరిగి జీఓ. 59 కింద దరఖాస్తు చేసుకోవాలి.

ప్రశ్న: దరఖాస్తుదారులు దళారుల మాయలో పడకుంటా ఏమి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: దరఖాసుదారులు నేరుగా మీ సేవలలో అప్లై చేసుకుని వారిచ్చిన రసీదును జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. ఏమైనా అనుమానాలు ఉంటే నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవాలి. దళారుల మాటలు నమ్మవద్దు. ఈ విషయమై రెండు రోజుల్లో మీ సేవ నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాం.

ప్రశ్న: ప్రస్తుతం జీఓ.59 కింద ఎన్ని రిజిస్ట్రేషన్ జరిగాయి.?

జవాబు: గతంలో జీఓ. 59 కింద దరఖాస్తు చేసుకున్న 14,518 లో 4032 మందికి డిమాండ్ నోటీసులు పంపించాం. అందులో 450 మంది మొదటి విడతలోనే పూర్తి డబ్బులు కట్టగా, ఇప్పటికి 98 మందికి రిజిస్ట్రేషన్‌ను చేయించాం. మిగతా రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేస్తున్నాం.

తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..


ఐశ్వర్య కన్వెన్షన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

చింతల్: తెలంగాణ రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఈనెల 8న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్రమోదీ నగరానికి వచ్చేస్తున్న నేపథ్యంలో మంగళవారం ఐడీపీఎల్ చౌరస్తాలోని ఐశ్వర్య కన్వెన్షన్ హాలులో బీజేపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీశైలంగౌడ్ మాట్లాడారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పలు అభివృద్ధి పనులతో పాటు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లను ప్రధాని ప్రారంభించనున్నారని తెలిపారు. అనంతరం పెరేడ్ గ్రౌండ్‌లో బహిరంగ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే ప్రధాని బహిరంగ సభకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలి వెళ్లి విజయవంతం చేయాలని కోరారు. దేశానికి ప్రధాని అవసరం ఎంతో ఉందన్నారు. కుంభకోణాల కాంగ్రెస్ పార్టీ, లీకేజీలు, కమిషనర్ల బీఆర్‌ఎస్ పార్టీలతో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌మల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, జాయింట్ కన్వీనర్ రాముగౌడ్, పార్లమెంటు కో–కన్వీనర్ డాక్టర్ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు గరిగె శేఖర్ ముదిరాజ్, బక్క శంకర్‌రెడ్డి, బావిగడ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, జిల్లా పదాధికారులు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, వివిధ మోర్చాల నాయకులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ భారీ షెడ్డు నిర్మాణం

చూసీచూడనట్లు అధికారగణం


బీరప్పనగర్‌కు వెళ్లే రోడ్డులో నిర్మిస్తున్న భారీ షెడ్డు

కుత్బుల్లాపూర్: సర్కిల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఓ అక్రమ భారీ షెడ్ ఏర్పాటు చేస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు కళ్లు మూసుకున్నారు. ప్రధాన రోడ్డుపైనే ఈ తతంగం జరుగుతున్నా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. కుత్బుల్లాపూర్ సర్కిల్ జీడిమెట్ల డివిజన్ బీరప్పనగర్‌కు వెళ్లే రోడ్డులో సుమారు 400 గజాలకు పైగానే ఉన్న ఈ స్థలంలో భారీ షెడ్డు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో నిర్మాణ దశలో ఉండగా అధికారులు పనులను అడ్డుకున్నారు.

మళ్లీ నిర్మాణ పనులు షురూ..

తాజాగా మళ్లీ నిర్మాణం జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరించడంపై పుకార్లు షికార్లు చేస్తున్నాయి. పెద్ద మొత్తంలో అధికారులకు డబ్బులు ముట్టజెప్పి సర్కిల్ కార్యాలయ ఆదాయానికి గండి కొట్టే విధంగా ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతున్న విషయంపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయినా ఏ ఒక్క అధికారి ఆ అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయకపోవడంతో నిర్మాణదారుడు డోన్ట్ కేర్ అంటూ పనులు చేయడం అనుమానాలకు ఆజ్యం పోస్తుంది.

అక్రమ నిర్మాణంతో ప్రభుత్వ ఆదాయం గండి...

కూకట్‌పల్లి జోనల్ లెవెల్‌లో ప్రత్యేక సిబ్బందిని నియమించి అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ వస్తున్నారు.. అయితే స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించాల్సిన అవసరం ఉన్నప్పటికీ వారు చూసీచూడనట్లు వదిలివేయడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. 100 గజాల స్థలంలో నిర్మాణం చేపడితే లక్షల్లో ఫీజుల రూపంలో జీహెచ్ఎంసీకి చెల్లించాల్సి ఉంటుంది. ఇలా అక్రమ నిర్మాణదారులు మాత్రం అవేమీ పర్మిషన్లు తీసుకోకుండా అక్రమంగా నిర్మాణాలు చేపట్టి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదే విషయంపై టౌన్ ప్లానింగ్ అధికారిని ప్రభావతిని ×సాక్షివివరణ కోరగా అక్కడ అక్రమ నిర్మాణం జరుగుతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. నిర్మాణదారుడు ఎవరైనా వెళ్తే అధికారులపై తప్పుడు సమాచారం ఇస్తున్నాడని అన్నారు. తప్పకుండా అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తామని స్పష్టం చేశారు.

కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలి

రంగారెడ్డినగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ విధానాలతో దేశ వ్యాప్తంగా రైతులు, కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లిందని సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. ఈనెల 5న దేశరాజధాని న్యూఢిల్లీలో జరిగే కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ రైతు బజారు నుంచి సాగర్ హోటల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. రైతు పండించే పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించి కొనుగోలును గ్యారంటీ చేయాలన్నారు. 60 ఏళ్లకు పైబడిన వారందరికీ పెన్షన్ అమలు చేయాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరింప చేయాలన్నారు. కార్మికులకు రక్షణ చట్టం అమలు చేయాలన్న ఉద్దేశంలో లక్షలాది మందితో చలో పార్లమెంట్ కార్యక్రమం జరుగుతుందన్నారు.వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంటే కేంద్ర ప్రభుత్వానికి పట్టడం లేదని తెలిపారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు చలో పార్లమెంట్ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు అంజయ్య బీరయ్య, శ్రీనివాస్, వీరేష్, దుర్గా నాయక్, ఎల్లయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమాన్ని గాలికొదిలేశాయి'


అంజయ్యనగర్‌లో కరపత్రాలు అందజేస్తున్న టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

జగద్గిరిగుట్ట: కాంగ్రెస్ పార్టీతోనే బంగారు తెలంగాణ సాధ్యమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి అంజయ్యనగర్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టారు. అనంతరం తెలుగుతల్లి విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచుతూ కాంగ్రెస్ పార్టీని బలపర్చాలని కోరారు. అనంతరం హన్మంతరెడ్డి మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్నారు. మాజీ వార్డు మెంబర్ గణేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు శ్రీనివాస్‌చారి, వీరారెడ్డి, అంజిరెడ్డి, మహిళా నాయకులు కౌసల్య, కమల, అవిజె జెమ్స్, సంజీవరెడ్డి, రాహుల్, శివ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ కల్యాణోత్సవం


టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, కుత్బుల్లాపూర్ బి-బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఏ–బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డలో మంగళవారం నిర్వహించిన ఎల్లమ్మ కల్యాణోత్సవంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నర్సారెడ్డి భూపతిరెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కరుణకటాక్షాలు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అమ్మవారి కల్యాణోత్సవంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు సదానందం, యువజన కాంగ్రెస్ నాయకులు మద్దికుంట నవీన్ రెడ్డి, ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర యువజన అధ్యక్షుడు ఇరుగు రాధాకృష్ణ, మండల కిసాన్‌సెల్ అధ్యక్షుడు రాజిరెడ్డి, డివిజన్ల మెంబర్‌షిప్ ఇన్‌చార్జ్‌లు ఫలాహ్ ఉర్ రహ్మాన్, భరత్‌గౌడ్, మైనారిటీ నాయకులు సమీర్ ఖాన్, బత్తుల చిరంజీవి, మిద్దెల సీతారామ్‌రెడ్డి, మల్లారెడ్డి, దుర్గా ప్రసాద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వీసీ చాంబర్ వద్ద పోలీసుల మోహరింపు..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ చాంబర్ కన్నా రాష్ట్ర మంత్రుల నివాసాలే నయమని పీహెచ్‌డీ విద్యార్థులు మండిపడ్డారు. పెంచిన పీహెచ్‌డీ ఫీజులను తగ్గించాలని మంగళవారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లగా అనుమతి లేదని పోలీసులు రెండు గంటల పాటు అడ్డుకున్నారని ఏఐఎస్ఎఫ్ నేత సత్య పేర్కొన్నారు. విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వీసీ ప్రొ.రవీందర్‌ను నియమిస్తే విద్యార్థులకు సమయం ఇవ్వకపోవడం దారుణమన్నారు. విద్యార్థుల పట్ల వీసీ రవీందర్ అనుసరిస్తున్న విధానాలతో సీఎం కేసీఆర్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందన్నారు.

ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి


మృతిచెందిన కార్మికుడు శంకర్‌భక్త్


ప్రమాదం చోటు చేసుకున్న అపార్ట్‌మెంట్

జీడిమెట్ల: నిర్మాణ దశలో ఉన్న భవనంపై నుంచి ఓ కార్మికుడు పడి మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం మల్కానిగిరి జిల్లా కలిమెల గ్రామానికి చెందిన శంకర్‌భక్త్(42) మూడు నెలల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చాడు. తెలిసిన వారి సహాయంతో చింతల్ పట్వారీ ఎన్‌క్లేవ్‌లోని స్టార్‌లైట్ గ్లోబల్ ఇండియా ఎంటర్‌ప్రైజెస్ సంస్థలో సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం విధుల్లో భాగంగా స్లాబ్ వేసేందుకు సిద్ధంగా ఉన్న భవనం నాల్గో అంతస్తుపైకి ఎక్కాడు. అనంతరం రాడ్‌కు నట్టుబోల్ట్ బిగిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో శంకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పంచనామా నిర్వహించి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.15లక్షలు

మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సంస్థ నిర్వాహకులతో చర్చించి భాదిత కుటుంబానికి న్యాయం జరిగేలా చేశారు. ఎట్టకేలకు కార్మికుడి కుటుంబానికి రూ.15లక్షలు ఇచ్చేందుకు సంస్థ నిర్వాహకులు ఒప్పుకున్నారు.

స్వచ్ఛతకు కేరాఫ్‌గా నిజాంపేట్‌ను తీర్చిదిద్దుతున్నాం



నిజాంపేట్: స్వచ్ఛతకు కేరాఫ్‌గా నిజాంపేట్ కార్పొరేషన్‌ను తీర్చిదిద్దుతున్నామని మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. నిజాంపేట్ హిల్‌కౌంటీ కాలనీ మహిళలు మంజుల, శైలజ, ఐషా, సాధన మంగళవారం మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హిల్ కౌంటీ కాలనీలో వ్యర్థాల విభజన ప్రక్రియ ప్రారంభమై సంవత్సరం పూర్తయిన నేపథ్యంలో మేయర్‌కు ఆర్గానిక్ మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ... స్వచ్ఛ సర్వేక్షన్‌లో కాలనీలు, బస్తీల ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఇళ్ల వ్యర్థాలను స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని కోరారు.

బొగ్గు, సిమెంట్, ఇటుకల గోదాములను తరలించాలి


మేనేజర్ సునందకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

దుండిగల్: నివాస గృహాల సమీపంలో ఏర్పాటు చేసిన బొగ్గు, సిమెంట్, ఇటుకల గోదాములను ఇక్కడి నుంచి తరలించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గండిమైసమ్మలోని దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ సునందకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ మాట్లాడుతూ.. డి.పోచంపల్లిలోని జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన బొగ్గు, సిమెంట్ ఇటుకల తయారీ నుంచి నిత్యం దుమ్ము, ధూళి వస్తోందన్నారు. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. సదరు గోదాములను వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. డి.విఘ్నేశ్వర్ చారి, శ్రీశైలంయాదవ్, మల్లారెడ్డి, వెంకటేశ్ నాయక్, శ్రీనునాయక్ తదితరులు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

సాయికృష్ణకాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


ప్రజల సమస్యలను వినుంటున్న శంభీపూర్ రాజు


ప్రగతినగర్‌లో పాదయాత్ర చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

నిజాంపేట్: సాయికృష్ణ కాలనీవాసుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ వార్డు పరిధిలోని సాయికృష్ణ కాలనీ, చందు లేఅవుట్, ఆర్‌కే లేఅవుట్, ఎన్‌ఆర్‌ఐ కాలనీ, అపురూప కాలనీల్లో మంగళవారం ఎమ్మెల్సీ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న డ్రైనేజీ సమస్యతో పాటు మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు శంభీపూర్ రాజు దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కారించాలని అధికారులను ఆయన ఆదేశించారు.ప్రజల గత కొంత కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కొన్ని కాలనీల నాయకులు వినతి పత్రాలు అందజేశారు. ప్రజలు సమస్యలు వివరిస్తున్నంత సేపు ఎంతో ఓపికగా సమస్యలను విని సాధ్యమైనంత త్వరగా పరిష్కారించాలని కమిషనర్ రామకృష్ణారావును ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. అభివృద్ధి పనుల కోసం ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. స్థానిక కార్పొరేటర్ చిట్ల దివాకర్ సమస్యలకు గత కారణాలను ఈ సందర్భంగా వివరించారు.

శంభీపూర్ రాజుకు ఘన స్వాగతం...

ప్రగతినగర్‌లో పాదయాత్రకు విచ్చేసిన ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజుకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. దారి పొడువున పూలు చల్లి స్వాగతం పలికారు. శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలను నీలా గోపాల్‌రెడి, కమిషనర్ రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, ఫ్లోర్ లీడర్ ఆగం పాండు, ప్రగతినగర్ ఫౌండర్ దయాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాస్‌యాదవ్, బాలజీ నాయక్, సురేశ్‌రెడ్డి, నిజాంపేట్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, ఎస్ఎంసీ బీఆర్‌ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబ శివారెడ్డి, 2వ వార్డు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చందు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా సాంస్కృతికోత్సవం

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజినీరింగ్ కాలేజీలో సాంస్కృతికోత్సవం 'సిన్షిలేషన్స్' మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ సంగీత దర్శకుడు కోటి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఏ రంగంలోనైనా రాణించాలంటే సహనం, శ్రమ, అంకిత భావం ఎంతో అవసరమన్నారు. కోటి తాను స్వరపరిచిన కొన్ని పాటలను పాడి విద్యార్థులను ఉర్రుతాలుగించారు. కాలేజీలోని సంగీతానికి సంబంధించిన 'క్రెసెండో' విద్యార్థి కూటమి సభ్యులతో ముచ్చటించారు. చలనచిత్ర నటుడు వంశీ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేయకుండా తమకు నచ్చిన రంగంలో రాణించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రిన్సిపల్ డా.సీడీ నాయుడు, డా.బి.చెన్నకేశవరావు, వై.పద్మసాయి తదితరులు పాల్గొన్నారు.

దేవేందర్‌నగర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలను జేసీబీతో కూల్చి వేస్తున్న సిబ్బంది

సుభాష్‌నగర్: కొన్ని రోజులుగా నిశ్శబ్దంగా ఉన్న కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు ఒక్కసారిగా కబ్జాదారులకు షాక్ ఇచ్చారు. గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని సర్వే నంబర్.342 మంగళవారం తహసీల్దార్ సంజీవరావు దగ్గర ఉండి 8 గదులను నేల మట్టం చేయించారు. కొన్ని రోజులుగా కూలివేతల జోలికి పోకుండా ఉండటంతో కబ్జారాయుళ్లు ఊపిరి పీల్చుకున్నారు. అంతలోనే ఒక్కసారిగా పెద్ద ఎత్తున కూల్చివేతలు జరగడంతో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 58, 59 ముసుగులో కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

10వ తేదీ నుంచి జార్జిరెడ్డి వర్ధంతి కార్యక్రమాలు


మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పూర్వ విద్యార్థి పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు జార్జిరెడ్డి వర్ధంతి పురస్కరించుకొని వర్సిటీలో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పీడీఎస్‌యూ నేతలు పేర్కొన్నారు. మంగళవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ నాయకులు ఎస్. నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఈ నెల 14న జార్జిరెడ్డి వర్ధంతి సందర్భంగా పీడీఎస్‌యూ స్పోర్ట్స్ లీగ్ పేరుతో ఈ నెల 10 నుంచి 12 వరకు వివిధ క్రీడాపోటీలు, 13న జార్జిరెడ్డి సినిమా ప్రదర్శన, 14న బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. వర్ధంతి కార్యక్రమాలలో విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సుమంత్, స్వాతి, రుక్మత్‌పాషా, చిరంజీవి, నరేష్, సాయికుమార్, క్రాంతి, మహేష్, మధులత, మనిదీప్, తరుణ్, సంధ్య, సృజన, వినయ్, రాజేష్ పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

నిజాంపేట్: సకాలంలో పన్నులు చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని నిజాంపేట్ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణ అన్నారు. ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 30తో ముగియనున్న నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలోని ఇళ్ల యజమానులు 5శాతం రాయితీతో పన్నులు చెల్లించే అవకాశం కల్పించామన్నారు. ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆస్తిపన్ను లక్ష ఉంటే రూ.95వేలు చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. ఎంత ఆస్తి పన్ను ఉన్నా ఏప్రిల్ 30వ తేదీ లోపు చెల్లిస్తే 5శాతం రిబేటు ఉంటుందని పేర్కొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం


రూ.8లక్షల చెక్కను అందజేస్తున్న జెడ్సీ

కుత్బుల్లాపూర్: కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్య పనులు చేసే నర్సింహ ఉదయం విధుల్లో ఉండగా రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న జెడ్సీ మమత మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో ఉపకమిషనర్ మంగతాయారుతో కలిసి మృతుడి కుటుంబ సభ్యులకు రూ.8 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు. కార్మికుడి కుటుంబానికి అండగా నిలిచిన సర్కిల్ అధికారులకు కూకట్‌పల్లి జోన్ యూనియన్ అధ్యక్షుడు చిట్యాల శివకుమార్ కృతజ్ఞతలు తెలియజేశాడు.